ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కంకిపాడు: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు... పట్టణానికి చెందిన పి.వెంకటేష్ (24) క్యాటరింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. మద్యం సేవిస్తున్నాడని తల్లి మందలించటంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అంగరంగ వైభవంగా స్మృతి వనం



స్మృతివనం పనులు పరిశీలిస్తున్న ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి



ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీపీ టీకే రాణా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్ మైదానంలో ఈ నెల 19వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి అన్నారు. స్మృతి వనం ప్రారంభోత్సవ ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోనే అత్యంత వైభవంగా స్మృతివనం ప్రారంభోత్సవం చేస్తాయని తెలిపారు. భారత రాజ్యాంగ రూపకర్తకు అరుదైన గౌరవం లభించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్మృతివనాన్ని తీర్చిదిద్దారని చెప్పారు. ఏర్పాట్లను విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ్ పరిశీలించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మున్సిపల్ కమిషనర్లు వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు.

అంబేడ్కర్ స్మృతివనం భద్రతా ఏర్పాట్లు పరిశీలన

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 19వ తేదీన ప్రారంభం కానున్న అంబేడ్కర్ స్మృతివనం వద్ద తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లను జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం పరిశీలించారు. స్మృతివనం ప్రాంగణాన్ని పరిశీలించిన సీపీ రాణా అక్కడ తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లను పోలీసు అధికారులకు వివరించారు. ఈ పర్యటనలో డీసీపీలు విశాల్‌గున్ని, వి.అజిత, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, ఏసీపీ డాక్టర్ రవికిరణ్ ఉన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కండి

మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజాబాబు



మోడల్ పోలింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడతూ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ కేంద్రం ఎలా ఉంటుంది, ఎలా ఓటు వేయాలనే విషయాలపై అవగాహన కలిగించేందుకు ఈ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కేంద్రంలో ఓటర్లకు ఓటు ఎలా వేయాలో శిక్షణ ఇస్తామన్నారు. పోలింగ్ కేంద్రంలో ఏవేమి ఉంటాయో తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కేంద్రాన్ని సందర్శించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్త ఓటర్లు ఎక్కడ ఏ సమాచారం అందుబాటులో ఉంటుంది... తమ పేరును ఎక్కడ పరిశీలించుకోవచ్చు... ఏ విధంగా అభ్యర్థికి ఓటు వేయాలి, పోలింగ్ కేంద్రంలో ఏమి చేయవచ్చు, ఏమి చేయకూడదో తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు. ఓటరుకు సహాయ పడేందుకు వీలుగా అన్ని పరికరాలను ఏర్పాటు చేశామన్నారు. గర్భిణులు, దివ్యాంగులు, బాలింతలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. చిన్నపిల్లలు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు ఇటువంటి మోడల్ పోలింగ్ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజలందరూ పోలింగ్ కేంద్రం నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఇలాంటి మోడల్ పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు ఏ విధంగా ఓటు వేయాలో విధివిధానాలను సిబ్బంది తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీవో రాణి, డీపీవో నాగేశ్వరనాయక్, డీఎస్‌వో పార్వతి, వివిధ పార్టీల నాయకులు షేక్ సలార్ దాదా, పంతం గజేంద్ర, కొడమంచిలి చంద్రశేఖర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం సురేష్, డిప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద జీవితం యువతకు ఆదర్శం

గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్



వివేకానంద విగ్రహానికి గజమాల వేస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడ్లవల్లేరు: స్వామీ వివేకానంద చూపిన బాట నేటి యువతకు ఆదర్శనీయమని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని సింగలూరులోని యువజన దినోత్సవాలను శుక్రవారం భాగ్య విదాత చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ కుమార్ తొలుత గ్రామంలోని వివేకానంద భారీ విగ్రహానికి గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివేకానంద బోధనలు అనుసరణీయమన్నారు. విద్యార్థులు, వృద్ధులకు వస్త్ర దానం చేశారు. ఈ వస్త్ర దాన కార్యక్రమాన్ని హైదరాబాదు దిల్‌సుఖ్ నగర్ శుభం చిల్డ్రన్స్ వేర్ అధినేత కౌశిక్ కృష్ణ ఆర్థిక సాయంతో నిర్వహించినట్లు డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ ఏఎన్నార్ కాలేజీ సెక్రటరీ కె.ఎస్.అప్పారావు, గుడ్లవల్లేరు ఎస్‌ఐ జి.సత్యనారాయణ, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, సంఘ సేవకుడు రామకృష్ణ(ఆర్కే), బీవీపీ ప్రతినిధులు చోడవరపు విజయ్ కుమార్, రూప్‌చంద్ జైన్, గుడ్లవల్లేరు సంత కమిటీ కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, సర్పంచి కాడిశెట్టి అర్జునరావు, ఉప సర్పంచి నందం శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి

ముదినేపల్లి రూరల్: స్వామి వివేకానంద జయంతిని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో పీ మల్లీశ్వరి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు, కార్యదర్శులు వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వివేకానంద జీవితచరిత్రను యువత ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలు నెరవేర్చాలన్నారు. విగ్రహదాత, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి ఏఎస్ఆర్‌కేఎల్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, సుబ్బారావు, ప్రసాద్, చలమయ్య, మహేశ్వరీ నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండ లాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎడ్లు



మొదటి స్థానం సాధించిన రైతుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: స్థానిక లింగవరం రోడ్‌లోని కె-కన్వెన్షన్ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే కొడాలి నాని ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు ప్రదర్శన రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దండమూడి శేషగిరిరావు (గిరిబాబాయ్) నాలుగు పళ్ల విభాగం పోటీలను ప్రారంభించారు. రెండవ రోజు జరిగిన నాలుగు పళ్ల విభాగంలో మొత్తం 10 జతల ఎడ్లు పాల్గొనగా 9 విభాగాలకు బహుమతులు అందచేశారు. మొదటి బహుమతి (రూ.35 వేలు) లింగం ఆంజనేయ చౌదరి, రెండో బహుమతి (రూ.30 వేలు) ఐదుళ్లపల్లి శ్రీనివాసరావు- పాలడుగు కంబైన్స్ శాఖమూరి పవన్‌కుమార్ చౌదరి, మూడో బహుమతి (రూ.25 వేలు) మోదుగుల రామిరెడ్డి, నాల్గో బహుమతి (రూ.22 వేలు) మదనబోయిన కావేరి లక్ష్మీ యాదవ్, ఐదో బహుమతి (రూ.18 వేలు) రాయుడు సుబ్బారావు, దండు అప్పారావు, ఆరో బహుమతి (రూ.15 వేలు) కవులూరి హుస్సేన్, ఏడవ బహుమతి (రూ.13 వేలు) కడియం బాలశ్రీ, ఎనిమిదో బహుమతి (రూ.10 వేలు) వల్లభనేని మోహనరావు, తొమ్మిదో బహుమతి (రూ.8 వేలు) ఎల్ గోపీస్ భైరవలకు చెందిన ఎడ్లు కైవసం చేసుకున్నాయి.

ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం సంప్రదాయబద్ధంగా జరిగాయి. తహసీల్దార్, స్టేడియం కోశాధికారి కె.ఆంజనేయులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గంగిరెద్దుల ప్రదర్శన, రంగవల్లులు, కోలాటం, క్లాసికల్ డ్యాన్స్ కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, టగ్ ఆఫ్ వార్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, స్టేడియం కమిటీ మాజీ ఉపాధ్యక్ష సంయుక్త కార్యర్శిలు పాలేటి చంటి, పర్వతనేని ఆనంద్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఆలయ పునర్నిర్మాణ పనులు

మండవల్లి: అయ్యవారిరుద్రవరంలో శ్రీసాంబశివుని ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు ఎండోమెంట్స్ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సిఫారసు మేరకు ప్రభుత్వం దేవదాయ శాఖ సీజీఎఫ్ నిధుల నుంచి రూ.52 లక్షల 33 వేలు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు గుడిపాటి, బొడ్డుపాటి వంశీకులు రూ.27 లక్షల 67 వేలు అందజేయడంతో మొత్తం రూ.80 లక్షలతో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మే నెల నాటికి పునఃప్రతిష్టకు చర్యలు తీసుకుంటున్నట్లు శింగనపల్లి వివరించారు.

వేణుగోపాలునికి ముత్యాల హారతులు



పామర్రు: ధనుర్మాసం సందర్భంగా స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ముత్యాల హారతులను ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీ గోదాదేవి రంగనాథ స్వాములకు ప్రత్యేకంగా ఆవుపాలతో ఆవు పెరుగు, నెయ్యి, తేనే, పంచదారలతో అభిషేకాలను చేశారు. భక్తులు అందరూ హారతులను వెలిగించి హారతి పళ్లాలలో ముత్యాలను వేసి హారతులను ఇచ్చారు. కార్యక్రమంలో మోరా రాజశేఖర్‌రెడ్డి దంపతులు పీటలపై కూర్చుని పూజాధికాలను నిర్వహించారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఆర్ ఎస్ ఎన్ ప్రసాద్, ఆధ్వర్యంతో నిర్వహించారు. ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి, భక్తులు వేణుగోపాలస్వామి, సుమతి, దేవి, సుభద్ర, రమాదేవి, సుశీల తదితర భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



తోట్లవల్లూరు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని యాకమూరులో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక కోదండ రామాలయం వద్ద శుక్రవారం జరిగిన ముగ్గుల పోటీల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను నిర్వాహకులు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కన్సొలేషన్ బహుమతులను అందించారు. గ్రామ పెద్దలు గుర్రాల ఆదినారాయణ, రవి, చొప్పరపు రాజేష్, బాల, అంబటి సతీష్, చొప్పరపు రామకృష్ణ పాల్గొన్నారు.

పోలీసు పెట్రోల్ బంక్ ఏర్పాటుకు శంకుస్థాపన



కైకలూరు: స్థానిక టౌన్ పోలీసు స్టేషన్ వద్ద పోలీసు వెల్ఫేర్ ఫిల్లింగ్ స్టేషన్ (హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు) ఏర్పాటుకు ఏలూరు జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (అడ్మిన్) ఎంజేవీ.భాస్కరరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. బంకు నిర్మాణం చేసిన తర్వాత నిర్వహణ బాధ్యత పోలీసులు చేపడతారన్నారు. కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ (డీఏఆర్) బి.చంద్రశేఖర్, ఏలూరు ఆర్‌ఐ (డీఏఆర్) జీఎస్‌పీబీ.కుమార్, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసరావు, కై కలూరు టౌన్ సీఐ ఆకుల రఘు పాల్గొన్నారు.

స్వేచ్ఛా జీవితానికి అంబేడ్కర్ ముఖ్య కారణం

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ చిత్రంలో కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): దేశంలో అందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే అందుకు ముఖ్య కారణం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ అన్నారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా జిల్లా స్థాయి సామాజిక సమతా సంకల్ప కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితచరిత్ర ఒక మహాకావ్యమని తెలిపారు. 140 కోట్ల మంది భారతీయులు స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే అందుకు కారణం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాత్రమేనని తెలిపారు. సమాజంలోని అసమానతలు, రుగ్మతలు రూపుమాపేందుకు అంబేడ్కర్ ఎంతగానో పాటుపడ్డారని చెప్పారు. 100 సంవత్సరాల క్రితం ఎవరైనా ఉద్యోగం, చదువు, వ్యాపారం కోసం బయట ప్రదేశాలకు వెళ్లేందుకు హక్కు ఉండేది కాదన్నారు. మహిళలు నేడు స్వేచ్ఛగా అమెరికాకు, ఇతర ప్రాంతాలకు వెళుతున్నారంటే అంబేడ్కర్ చలువేనని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం ద్వారా 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సమాజంలో అందరికీ సమానమైన స్వేచ్ఛ ఉందన్నారు. అటువంటి మహనీయుని 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున 20ఎకరాల్లో రూ. 400 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. విగ్రహం కింది భాగాన 3 వేల మంది కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాటు, 2 వేల మందికి కూర్చునే వీలుగా ఓపెన్ థియేటర్, 10 వేల పుస్తకాలతో గ్రంథాలయం ఏర్పాటు చేశారన్నారు. ఆయన జన్మదినం రోజున ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ విజ్ఞాన దినోత్సవంగా ప్రకటించిందని అదే మన దేశానికి గర్వకారణమన్నారు. ఈ నెల 19వ తేదీన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి దేశంలోని లక్షలాది మంది ప్రజలు వస్తున్నారని చెప్పారు. కలెక్టర్ రాజాబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పండుగ పేరుతో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



టూటౌన్ సీఐ తులసీధర్



ఎస్‌ఐ పల్లా నాగకళ్యాణి

గుడివాడరూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ బి.తులసీధర్ పేర్కొన్నారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జాషువా, గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో జూద క్రీడలు నిర్వహించకుండా తగిన జాగ్రత్తలు చేపడుతున్నామన్నారు. సంక్రాంతి పండుగ తెలుగువారికి అతి పెద్ద పండుగ అని, పండుగ ముసుగులో జూదాలు నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదు చేసిన జూదరులకు ఇప్పటికే కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. జూదాల సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గుడివాడ వన్‌టౌన్ పరిధిలో జూదాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ కె.ఇంద్ర శ్రీనివాస్ హెచ్చరించారు. జూదాల నిర్వహించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. నందివాడ, గుడ్లవల్లేరు, గుడివాడ మండలాల్లో కూడా సంక్రాంతి పండుగ సందర్భంగా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాలూకా సీఐ ఏసుబాబు హెచ్చరించారు. జూదాలు నిర్వహించకుండా పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు.

జూదాలకు దూరంగా ఉండాలి

పెదపారుపూడి: సంక్రాంతి పండుగ పురష్కరించుని సంప్రదాయ ముసుగులో జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పల్లా నాగకళ్యాణి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సంక్రాంతి సందర్భంగా జూదాల నివారణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గతంలో జూద క్రీడలు ఆడి కేసులు నమోదైన జూదరులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. గ్రామాల్లో జూదాల సమాచారం చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ సమీక్ష

పెదపారుపూడి: సంక్రాంతి పండుగా పురష్కరించుకుని కోడి పందాలు, హింసాత్మక జంతు పదర్శనలు నిర్వహించటం 1960 చట్టం ప్రకారం గేమింగ్‌యాక్ట్ 1974 ప్రకారం నేరమని తహసీల్దార్ వి.నాగభూషణం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కోడిపందేల నివారణపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో పండుగా సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాటపై సచివాలయాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో బారులు నిర్వహించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్‌ఐ పల్లా నాగకళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

అన్నవరం (జగ్గయ్యపేట): ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. భీమనపల్లి శ్రీనివాసరావు (36) తెలంగాణ రాష్ట్రంలోని ఓ పేపర్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. మందు కొట్టేందుకు బావి వద్దకు నీళ్ల తెచ్చుకోవడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. అయితే పొలానికి వెళ్లిన శ్రీనివాసరావు మధ్యాహ్నం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదు. అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిల్లకల్లు ఎస్‌ఐ కృష్ణబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలి



గుడివాడరూరల్: సచివాలయ పరిధిలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని బిళ్లపాడు సచివాలయ ప్రత్యేకాధికారి బి.అనంతలక్ష్మి పేర్కొన్నారు. బిళ్లపాడు సచివాలయ ప్రత్యేకాధికారిగా మండల వ్యవసాయశాఖ అధికారిణి బి.అనంతలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ ప్రత్యేకాధికారికి బొకెలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ అధికారులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించి, వీలైనంత త్వరగా వారి పనులను పూర్తి చేసి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కారే జోసఫ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి కుళాయిల ఏర్పాటు



మండవల్లి: రానున్న వేసవిలో తాగునీటికి ఇబ్బందికి లేకుండా ఉండేందుకు మండవల్లి బీసీ కాలనీలో సర్పంచ్ మెండా ఝాన్సీ పర్యవేక్షణలో శుక్రవారం రెండు మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. కాలనీవాసులకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ ఝాన్సీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మెండా సురేష్, వార్డు సభ్యులు పెద్దింటి లక్ష్మీ కుమారి, అగొల్లు సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ



మండవల్లి: మండలంలోని చింతపాడులో రూ.కోటి 50 లక్షల నిధులతో మంజూరైన జల్ జీవన్ మిషన్ పనులు, రూ.26 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ ప్రజలకు కావలసిన అవసరాలు తీర్చడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, ముంగర నరశింహారావు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఘంటసాల మహావిష్ణు, ఎంపీటీసీ జయమంగళ వీర్రాజు, మాజీ ఎంపీపీ ముంగర గోపాల కృష్ణ, మాడపాటి చింతయ్య, మోరు జాన్, సైదు వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- రూ.1.25 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



బొడ్డపాడులో గ్రామ సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరు మండలంలో రూ.1.25 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన ప్రారంభోత్సవాలు నిర్వహించారు. యాకమూరులో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, పాములలంకలో రూ.18.60 లక్షలతో ఆరు సిమెంటు రోడ్లు, రొయ్యూరులో రూ.20 లక్షలతో చేపట్టిన ఎనిమిది సిమెంటు రోడ్లు, బొడ్డపాడులో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రారంభించారు. ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఆయన అన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థఏర్పాటు ద్వారా దేశంలోనే ఆదర్శ పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. అవ్వా, తాతలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంచారన్నారు. అమ్మ ఒడి, నాడు–నేడుతో విద్యా వ్యవస్థలో కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన అందించటం ద్వారా పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదవటానికి అవకాశం కల్పించటం జరిగిందన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్ నూరు శాతం అమలు చేశారని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చెప్పారు. అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల వద్దకే వైద్యసేవలు, ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు మూడే శివశంకర్, ఆరేపల్లి శివరామకృష్ణ(రాము), ఎంపీడీఓ స్వర్ణలత, వైస్ ఎంపీపీ ఎం. వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ ఎం.రామచంద్రరావు, మండల సచివాలయ కన్వీనర్ ఎస్.రాజేంద్ర, పిరమిడ్ సేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివనాగకృష్ణ, ఎంపీటీసీ దారం రోజారాణి, గ్రామ సచివాలయ కన్వీనర్ ఎస్.నాగేంద్రబాబు, పీఆర్ డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ రాఘవరావు, పంచాయతీ కార్యదర్శి అంజనాదేవి పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు



ముదినేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యం చేరువ చేసిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులో అదనపు ప్రయోజనాలతో పాటు వైద్య పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని, ప్రతి పేదవాడి గడప ముంగిటే వైద్య సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణు, నిమ్మగడ్డ భిక్షాలు, బొర్రా శేషుబాబు, బత్తిన కిషోర్, అల్లాభక్షు, బేతపూడి వెంకటరమణ, ముత్యాల రాంబాబు, సోమా సత్యనారాయణ, జాస్తి చంటి, గురుముచ్చు సామియేలు, ఎంపీడీవో పీ మల్లీశ్వరీ, సీడీపీవో ఆనంద్, మండలంలోని పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం కొండంగి గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 359 మందికి వైద్య సేవలు అందినట్లు ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమల రమేష్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు దొనకొండ మేరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ బసవని వెంకటరాజు, మసిముక్కుల వెంకటేశ్వరరావు, గండికోట వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి సుబ్రహ్మణ్యం, జ్ఞానచంద్, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై సమీక్ష



మండవల్లి: మండలంలోని చింతపాడులో గ్రామాభివృద్ధిపై శుక్రవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పాల్గొని పేదలకోసం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో అందరూ ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గుడివాడ టౌన్: గుడివాడ రజక సంఘం, మల్లంపల్లి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మనసేవ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మల్లంపల్లి వెంకట్రావు మాట్లాడుతూ రజక సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ మేధావులు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో మనసేవ సంస్థ కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది బుద్ధవరపు వెంకట్రావును ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కరించారు. రజక ప్రముఖులు ఎం.అమ్మన్న బాబు, జె.వెంకటేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు, కె.ఆంజనేయ ప్రసాద్, బి.శ్రీనివాసరావు, ఐ.శంకర్, ఎన్.శేషుబాబు, బి.సాయిరాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ యూనిట్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ దీనిని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన పద్ధతిలో కాలితో పెడల్ నొక్కితే నీరు వచ్చే విధంగా ఈ ట్యాంక్ ఏర్పాటు చేశామని కార్యాలయానికి వచ్చే వారు ప్రతి ఒక్కరూ విధిగా చేతులు శుభ్రంచేసుకుని లోపలికి రావాలనే సంకల్పంతో దీనిని ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. సీఎంఎం జీఏ సుజాత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాదాసు వెంకట లక్ష్మీ కుమారి, సీఓలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఏవో జరీనా

మండవల్లి: మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎంఏవో ఎస్‌కే జరీనా పేర్కొన్నారు. ఏవో అధ్యక్షతన వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్, ప్రకృతి వ్యవసాయం, మినుము పంట సస్యరక్షణ చర్యలు గుర్చి వివరించారు. మండల వ్యవసాయ సలహామండలి చైర్‌పర్సన్ కురెళ్ళ ఏసుమరియమ్మ, మండల బోర్డు సభ్యులు, వీఏఏలు పాల్గొన్నారు.

17 నుంచి కార్యదర్శులకు శిక్షణ

మండవల్లి: ఈనెల 17, 18 తేదీల్లో మండల పరిధిలోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్ 6 కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, ఫ్రంట్‌లైన్ వర్కర్లు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టీకే వెంకటరమణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. స్థానిక సంస్థల్లో 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రాతిపదిక ప్రణాళిక తయారీ అమలులో భాగంగా 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీలకు ఇచ్చిన మార్గదర్శకాల అమలుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్లో బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ శిరీష



మండవల్లి హైస్కూల్‌లో తక్కెళ్లపాడు–పెరికెగూడెం టీమ్‌ల మధ్య ఉత్కంఠగా కబడ్డీ పోటీలు

ముదినేపల్లి రూరల్: గ్రామీణ యువత విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ రాణించాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. స్థానిక జెడ్పీహైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి గుర్తింపు తెచ్చేందుకు ముఖ్యమంత్రి జగనన్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, యువత సద్వినియోగం చేసుకుని సత్తా చూపాలని కోరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ సరదాగా కాసేపు బ్యాడ్మింటన్, వాలీబాల్ ఆటలు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు నందివాడ మండలంలో శుక్రవారం కూడా కొనసాగాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని జనార్ధనపురం గ్రామంలో జరిగిన క్రికెట్ పోటీలను నందివాడ ఎస్ఐ శిరీష బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. కాగా కబడ్డీ మహిళా విభాగంలో పుట్టగుంట జట్టు విజేతలుగా నిలువగా బ్యాడ్మింటన్ పోటీలలో తమిరిశ జట్టు, వాలీబాల్ విభాగంలో తుమ్మలపల్లి జట్టు విజేతలుగా నిలిచారన్నారు. జనార్ధనపురంలో జరిగిన క్రికెట్ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా 4 జట్లు సెమీ ఫైనల్స్‌కు ఎంపికయ్యాయని ఈనెల 17, 18 తేదీలలో సెమీ ఫైనల్స్, ఫైనల్స్ నిర్వహిస్తామని ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు తెలిపారు.

మండవల్లి: గ్రామీణ క్రీడాకారులను వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు శుక్రవారం పేర్కొన్నారు. మండవల్లి జెడ్పీ హైస్కూల్‌లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, లోకుమూడిలో క్రికెట్ మండల స్థాయి పోటీలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ ఝాన్సీ మాట్లాడుతూ క్రీడల ద్వారా దేహదారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎ.ఆనందబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి విజేతలు

మండవల్లి: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా మండల స్థాయిలో జరిగిన పోటీల్లో విజేతలను శుక్రవారం ప్రకటించారు. కబడ్డీ పోటీల్లో తక్కెళ్లపాడు–పెరికెగూడెం టీమ్‌లు తలపడగా 23–13 స్కోరుతో తక్కెళ్ళపాడు టీం విజయం సాధించింది. వాలీబాల్‌లో చింతపాడుపై భైరవపట్నం టీమ్ 16–14, 15–10 స్కోరుతో గెలిచింది. షటిల్ బ్యాడ్మింటన్‌లో, ఖోఖో పోటీల్లో చింతపాడుపై మండవల్లి టీమ్ విజయం సాధించింది. సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, పీడీలు నాగేశ్వరరావు, సుబ్బారావు, శ్యామల, పీఈటీలు పెరుమాళ్ల, వేణుబాబు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక జెడ్పీహైస్కూల్‌లో వాలీబాల్, షటిల్ ఆటల పోటీలు ఎంతో ఉత్కంఠంగా శుక్రవారం నిర్వహించారు. విజేతలను పామర్రు గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీంలు అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్రీడల ఇన్‌ఛార్జి అప్పికట్ల జవహర్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డీ ఆనంద్ రెడ్డి, హైస్కూల్ , పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి



పెదపూడిలో నివాళులర్పిస్తున్న సచివాలయ అధికారులు, గ్రామస్తులు

పెదపూడి(మొవ్వ): ఈ నెల 19వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు సచివాలయ అధికారులు ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పెదపూడి ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు, గ్రామస్తులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత విశేషాలను గ్రామస్తులకు వివరించారు. రాజ్యాంగ ప్రతిజ్ఞను నిర్వహించారు. విజయవాడలో జరిగే విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున గ్రామాల నుంచి తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో జే కోటేశ్వరరావు, గ్రేడ్–5 ఈవో కళావతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా కబడ్డీ టోర్నమెంట్



పెదపూడిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడి గ్రామంలోని జిమ్ గ్రౌండ్‌లో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ –17 బాలబాలికల ఇన్విటేషన్ గ్రామీణ కబడ్డీ టోర్నమెంట్ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఉత్కంఠంగా సాగుతున్నాయి. క్రీడా కారులు నువ్వా.. నేనా అనే రీతిలో ఎంతో పట్టుదలతో ఆడుతున్నారు. కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లా స్థాయిల స్థాయిలో జరుగుతున్న ఈ క్రీడా పోటీలను చూసేందుకు పరిసరప్రాంతాల నుంచి క్రీడాభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి 12 జట్లు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఫౌండర్ గొట్టుపాటి సాయి క్రీడలను పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్‌కు సంబంధించిన ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

పెదపారుపూడిలో...

పెదపారుపూడి: మండల గ్రామాల్లో శనివారం విద్యుత్ లైన్లు, స్థానిక సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నియమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ టీ. రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు నిలిపివేస్తామని పేర్కొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం

కలిదిండి: మూలలంక గ్రామంలో అగ్నిప్రమాద బాధితులను మానవత సేవా సంస్థ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో శీలం నాగేశ్వరావు మంటల్లో చిక్కుకుని మరణించారు. అతని కుటుంబ సభ్యులను మానవత సభ్యులు పరామర్శించి ఓదార్చారు. వారికి ఆర్థిక సహాయంగా రూ.7 వేలు, దుస్తులు అందజేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు, గుర్వాయపాలెం ఎంపీటీసీ గోదావరి సత్యనారాయణ, మూలలంక సర్పంచ్ మహాదేవ విజయబాబు, పీఏసీఎస్ చైర్మన్ నామాన అన్నవరం, సంస్థ చైర్మన్ పేటేటి వివేకానంద స్వామి, మారుబోయిన రత్నారావు, కలిదిండి ఆంజనేయులు, గెడ్డం దాసు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహించొద్దు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండల పరిధిలో కోడిపందేలు, జూదం, చిత్తు–బోకు, పేకాట ఇతర చట్ట వ్యతిరేక ఆటల పోటీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నందివాడ తహసీల్దార్ వి.భవన్నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికారిక శిబిరాలను నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

18న బహిరంగ వేలం

పామర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డు రోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 18వ తేదీ గురువారం ఉదయం 10గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు, పటిక బెల్లము పోగు చేసుకొను హక్కులకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. 20-01-2024 నుంచి 19-01-2025 వరకు కాలపరిమితి ఉంటుంది. వేలంలో పాల్గొనే వారు ధరావత్తుగా రూ.50 వేలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వివరాలను దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా పిచ్చమ్మ తల్లి ఆరాధన

కురుమద్దాలి(పామర్రు): మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలో రామ అవధూత పిచ్చమ్మ 73వ ఆరాధన మహోత్సవాలను శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కొసరాజు చంద్రభాను, కె.లక్ష్మీ కృష్ణతులసి, చరుకూరి రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈనెల 18వ తేదీన అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి అమ్మవారి నిర్యాణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

గృహ సారథి నాగేశ్వరరావు మృతి

కొమరవోలు(పామర్రు): మండల పరిధిలోని కొమరవోలు గ్రామానికి చెందిన గాంధీ ఆశ్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథి అయిన నాగేశ్వరరావు ఆకస్మికంగా మృతి చెందారు. పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ మృత దేహాన్ని సందర్శించి ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. గ్రామసర్పంచ్ దిరిశం రత్నకుమారి, ఎంపీటీసీ కానుమంచి నాగమల్లేశ్వరరావు, స్థానిక కొమరవోలు పీఏసీఎస్ అధ్యక్షుడు శింగవరపు రామచంద్రరావు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.